ఇన్నర్‌వీల్ లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంప్

మానవతా సదన్ పిల్లలతో ఇన్నర్‌వీల్ లేడీస్ క్లబ్ ప్రతినిధులు, వైద్యులు

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 2 : మండలంలోని ఘన్‌పూర్‌లో ఉన్న మానవతాసదన్‌లో ఇన్నర్‌వీల్ లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం హెల్త్‌క్యాంప్ నిర్వహించారు. బృందావన్ దవాఖాన పర్యవేక్షణలో డాక్టర్ బండారు ఉష 9-17 వయస్సు ఉన్న 53 మంది పిల్లలకు రెండో డోస్ హెచ్‌పీపీ వ్యాక్సిన్ వేశారు. ఈ వ్యాక్సిన్ వేయడం ద్వారా పిల్లలను క్యాన్సర్, టీబీ, హార్ట్‌ఎటాక్ తదితర వ్యాధుల బారిన పడకుండా కాపాడుకోగలుగుతామని తెలిపారు. సదన్‌లో అవకాశం కల్పించిన కలెక్టర్, రాజీవ్‌గాంధీ హన్మంతు, డీఈవో అశోక్, డాక్టర్ ఉషకు సదన్ కేర్‌టేకర్ రమేశ్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సందీప్, బృందావన్ దవాఖాన సిబ్బంది ప్రియాంక, సౌమ్య, పూజ, చంద్రశేఖర్, సందీప్, సతీశ్, మానవతా సదన్ సిబ్బంది పాల్గొన్నారు.

ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో రాణించాలి

సమావేశంలో పాల్గొన్న ముదిరాజ్‌లు

పోతంగల్, ఫిబ్రవరి 2 : ముదిరాజ్‌లు ఐక్యంగా ఉంటూ ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో రాణించాలని ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు కరాట రమేశ్ అన్నారు. మండలకేంద్రంలో ఆదివారం సమావేశమై.. గ్రామాల వారీగా కమిటీలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. కమిటీలు బృందాలుగా ఏర్పడి, ఈ నెలాఖరులో నిర్వహించే మండల కమిటీ ఎన్నిక సమావేశాన్ని విజయవంతం చేసేందుకు కమిటీలు పాటుపడాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా యూత్ ప్రెసిడెంట్ కిరణ్, జిల్లా ఉపాధ్యక్షుడు నీరడి గంగాధర్ ముదిరాజ్, పోతంగల్ మండల అధ్యక్షుడు సొప్ప శంకర్, ఉత్తం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో యువకుడి మృతి

ఇందల్వాయి, ఫిబ్రవరి 2 : ఇందల్వాయి పోలీస్‌స్టేషన్ పరిధిలోని చంద్రాయన్‌పల్లి గ్రామశివారులో 44వ నంబర్ జాతీయరహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. ఎస్సై మనోజ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్‌కు చెందిన బత్తుల నాగరాజు (32) పని నిమిత్తం నిర్మల్‌కు వెళ్లి ఆదివారం ఉదయం మెదక్‌కు బైక్‌పై తిరిగి వెళ్తున్నాడు. చంద్రాయన్‌పల్లి శివారులో వెనుక నుంచి వస్తున్న కంటైనర్ ఢీకొట్టడంతో నాగరాజు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య రజిని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మున్సిపల్ కార్పొరేషన్‌లో అధికారుల కొరత

- మూడునెలల్లోనే ఇద్దరు సీసీల మార్పు
- కార్పొరేషన్‌కు లేని హెల్త్ ఆఫీసర్

కంఠేశ్వర్, ఫిబ్రవరి 2 : నిజామాబాద్ కార్పొరేషన్‌లో అధికారుల కొరత స్పష్టంగా కనిపిస్తున్నది. కార్పొరేషన్‌లో దాదాపు పనులన్నీ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులతో నెట్టుకోస్తుండడంతో పాలనపూర్తిగా స్తంభించింది. హెల్త్, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్.. ఇలా ఏ విభాగం చూసినా పూర్తిగా అవుట్‌సోర్సింగ్ సిబ్బందిపైనే ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొన్నది.

కార్పొరేషన్‌కు లేని హెల్త్ ఆఫీసర్

మున్సిపల్ కార్పొరేషన్‌కు ప్రభుత్వం ఇప్పటివరకు ఎంహెచ్‌వోను నియమించలేదు. పారిశుద్ధ్య నిర్వహణపై పూర్తిగా నిఘా కొరవడింది. ఎంహెచ్‌వో లేకపోవంతో అడిగేవారు లేక సానిటేషన్ సిబ్బంది ఆడింది ఆట.. పాడింది పాటగా మారింది.

పూర్తిగా గాడితప్పిన టౌన్ ప్లానింగ్..

టౌన్ ప్లానింగ్ విభాగం గురించి అయితే చెప్పాల్సిన అవసరమే లేకుండా పోయింది. చేతులు తడిపితే చాలు ఎక్కడైనా అక్రమ నిర్మాణం ఎంతవరకైనా చేసుకోవచ్చనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల ఓ వ్యక్తి అక్రమ నిర్మాణానికి సంబంధించి కార్పొరేషన్‌లో ఫిర్యాదు చేయగా పట్టించుకోవడంతో చివరికి టౌన్ ప్లానింగ్ విభాగంపై కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేశారు. జనవరి 31న టౌన్ ప్లానింగ్ అధికారి సత్యనారాయణ పదవీ విరమణ చేశారు. ఆయన స్థానంలో నూతన టౌన్ ప్లానింగ్ అధికారిని నియమిస్తారా లేక ఎంహెచ్‌వో పోస్ట్‌లాగా వదిలేస్తారా వేచి చూడాల్సిందే.

మూడు నెలల్లోనే ఇద్దరు సీసీల బదిలీ

మూడు నెలల్లోనే ఇద్దరు సీసీలు బదిలీ అయ్యారు. గతంలో కమిషనర్ సీసీగా పనిచేసిన అంజత్ ఖాన్ డిప్యుటేషన్‌ను కలెక్టర్ రద్దు చేశారు. అనంతరం సీసీగా బాధ్యతలు చేపట్టిన రాకేశ్‌ను ఇంజినీరింగ్ విభాగానికి బదిలీ చేశారు. రెండు నెలల్లోనే రాకేశ్ కూడా బదిలీ కావడంతో ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మహ్మద్ ఇర్ఫాన్‌ను కమిషనర్ సీసీగా నియమించారు. రెండు సంవత్సరాలుగా పనిచేస్తున్న అడిషనల్ కమిషనర్ శంకర్ కూడా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో వరంగల్ నుంచి ఓ అధికారి జిల్లాకు వస్తున్నట్లు సమాచారం.

రెవెన్యూ విభాగంలో అంతర్గత బదిలీలు

కార్పొరేషన్‌లోని రెవెన్యూ విభాగంలో అంతర్గత బదిలీలు జరిగాయి. రెవెన్యూ ఆఫీసర్‌గా పనిచేస్తున్న నజీర్‌ను అదే విభాగంలోని ఆర్టీఐ కోర్టు కేసులు విభాగానికి బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఖదీర్ పాషాను నియమించారు. నజీర్‌ను కేవలం నాలుగు నెలల్లోనే రెవెన్యూ విధుల నుంచి తప్పించి, మరో అధికారికి బాధ్యతలు అప్పగించడం చర్చనీయాంశమైంది.

కలెక్టర్ పర్యవేక్షణలోనైనా గాడిన పడేనా...

కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఇటీవల మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేకాధికారిగా బాధ్యతలు చేపట్టారు. ఇప్పటికైనా కార్పొరేషన్ పాలన గాడిలో పడేనా అని పలువురు చర్చించుకుంటున్నారు. కార్పొరేషన్‌లో సమస్యపై అప్లికేషన్ ఇస్తే నెలలు గడిచినా పరిష్కారం కావడం లేదని నగర ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. చిన్న చిన్న సమస్యలకు కూడా 10 సార్లు కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేకాధికారి పాలనలోనైనా సమస్యలు పరిష్కారం కావాలని కోరుతున్నారు.

అధికారులు రావాల్సి ఉన్నది

అడిషనల్ కమిషనర్ శంకర్ బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో వరంగల్ నుంచి డిప్యుటీ కమిషనర్‌గా పనిచేసిన అధికారి వస్తున్నట్లు సమాచారం. కానీ ఇప్పటివరకు అధికారంగా ఎలాంటి సమాచారం లేదు. టౌన్ ప్లానింగ్‌కు సంబంధించి డీటీసీపీ నుంచి నియామకం జరగాలి. ఇప్పటివరకైతే టౌన్ ప్లానింగ్ అధికారి నియామకంపై ఎలాంటి సమాచారం లేదు. రెవెన్యూ విభాగంలో పనిఎక్కువగా ఉండడం.. నజీర్ ఆర్టీఏ కోర్టు విభాగానికి బదిలీ చేసి, ఖదీర్‌పాషాను ఆర్వోగా నియమించాం.

- దిలీప్‌కుమార్, మున్సిపల్ కమిషనర్

జిల్లాకు చేరుకున్న జైళ్ల శాఖ డీజీ

- నేడు జిల్లా జైలు సందర్శన

వినాయక్‌నగర్, ఫిబ్రవరి 2 : జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ సౌమ్య మిశ్రా ఆదివారం నిజామాబాద్‌కు చేరుకొని, ఓ హోటల్‌లో బసచేశారు. వసంత పంచమి సందర్భంగా తెల్లవారుజామున కుటుంబీకులతో బాసర పుణ్యక్షేత్రానికి వెళ్లనున్నారు. మధ్యాహ్నం నిజామాబాద్‌కు చేరుకొని జిల్లా జైలును సందర్శించనున్నారు.

వేసవిలో నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే లక్ష్యం

- ఎస్ఈ రాపల్లి రవీందర్

ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఎస్ఈ రాపల్లి రవీందర్

కంఠేశ్వర్, ఫిబ్రవరి 2 : వేసవిలో నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే లక్ష్యమని జిల్లా ఎస్ఈ (ఆపరేషన్) రాపల్లి రవీందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పవర్‌హౌస్‌లో రూ.1.5 కోట్లతో ఏర్పాటు చేసిన 12.5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో గాజుల్‌పేట్, బర్కత్‌పుర తదితర కాలనీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా ఉంటుందన్నారు. కార్యక్రమంలో విద్యుత్ అధికారులు శ్రీనివాసరావు, వెంకటరమణ, చంద్రశేఖర్, వీరేశం, నటరాజ్, రాజశేఖర్, భాస్కర్, ప్రసాద్, సాయిలు, మక్సూద్, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ సమైక్యతా శిబిరానికి టీయూ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 2 : ఈనెల 3 నుంచి 9వ తేదీ వకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పశ్చిమగోదావరి జిల్లా నర్సాపూర్‌లో నిర్వహించే జాతీయ సమైక్యత శిబిరానికి టీయూ పరిధిలోని ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఆదివారం తరలివెళ్లినట్లు టీయూ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య కొండ రవీందర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. రాష్ట్రం కంటిన్‌జెంట్ అధికారిగా జీడీసీ భీమ్‌గల్‌కు చెందిన పి.సుదర్శన్ వ్యవహరిస్తారని తెలిపారు. ఈ శిబిరానికి ఎం.శ్రీకాంత్, బి.రాము, సీహెచ్.గంగాప్రసాద్, పి.సంగీత (జీడీసీ భీమ్‌గల్), బి.మానస (సీజీజీ కాలేజీ), కె.నిర్మల తరలివెళ్లారని వివరించారు. శిబిరంలో కల్చరల్ లిటరరీ అంశాలపై పోటీలు, జాతీయ సమగ్రతపై అవగాహన, వికసిత్ భారత్, మై భారత్, యోగా, సామాజిక కార్యక్రమాలు, డ్రగ్స్‌ను నిరోధించడం, అభివృద్ధి పథంలో విద్యార్థులు తదితర అంశాలపై ప్రత్యేక తరగతులు ఉంటాయని పేర్కొన్నారు. వలంటీర్లకు వీసీ ఆచార్య యాదగిరిరావు, రిజిస్ట్రార్ ఆచార్య యాదగిరి అభినందనలు తెలిపారు.

శ్రీహరిహర క్షేత్రంలో ద్వాదశ బ్రహ్మోత్సవాలు

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 2 : మండలంలోని బర్ధిపూర్ గ్రామంలో ఉన్న శ్రీహరిహర క్షేత్రంలో ద్వాదశ బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. వేదపండితుడు శ్రీ పరాంకుశం వెంకట సీతారామాచార్యుల ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక పూజలు కొనసాగాయి. ఉత్సవాల్లో ఆర్టీసీ మాజీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, ధర్పల్లి మాజీ జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ హాజరై పూజలు చేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న 2005-06 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు

కోటగిరి, ఫిబ్రవరి 2 : మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకున్న 2005-06 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు అదే పాఠశాలలో ఆదివారం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని జరుపుకొన్నారు. విద్యార్థి దశ నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. అనంతరం తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పార్వతి, రమేశ్, గణేశ్, మనోహర్, హన్మంతరావు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

కెనరా బ్యాంకు ఆధ్వర్యంలో కూలర్ల వితరణ

కంఠేశ్వర్/ ఆర్మూర్ టౌన్, ఫిబ్రవరి 2 : కెనరా బ్యాంకు ప్రాంతీయ కార్యాలయం -నిజామాబాద్ ఆధ్వర్యంలో సీఎస్ఆర్‌లో భాగంగా కెనరా బ్యాంకు సర్కిల్ కార్యాలయం - హైదరాబాద్ సీజీఎం చంద్రశేఖర్, ప్రాంతీయ కార్యాలయ రీజినల్ మేనేజర్ బి.శ్రీనివాస్, సిబ్బంది ఆదివారం కూలర్లను వితరణ చేశారు. అంకాపూర్ గ్రామంలోని పొద్దుటూరి సదానందరెడ్డి అనాథ బాలుర వసతిగృహానికి 3 కూలర్లు, లాలన వృద్ధాశ్రమానికి 8 కూలర్లు వితరణ చేశారు.

కూలర్లు వితరణ చేస్తున్న కెనరా బ్యాంకు అధికారులు, సిబ్బంది

బేకరీలో కత్తులతో యువకుల హల్‌చల్

- ఓనర్‌కు బెదిరింపులు
- సీసీ కెమెరాల్లో రికార్డయిన దృశ్యాలు

వినాయక్‌నగర్, ఫిబ్రవరి 2 : బేకరీలో యువకులు కత్తులతో హల్‌చల్ చేసి, యజమానిని బెదిరించిన ఘటన నగరంలోని ఆరో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి చోటుచేసుకున్నది. స్థానికుల కథనం ప్రకారం.. నగర శివారులోని ధర్మపురిహిల్స్ ప్రాంతానికి చెందిన యువకుడు అష్వాక్ అదే కాలనీలోని బేకరీకి వెళ్లి ధర విషయంలో బేకరీ నిర్వాహకుడితో గొడవకు దిగాడు. అనంతరం తన స్నేహితులను వెంటబెట్టుకుని బేకరీకి వెళ్లి కత్తులతో హంగామా చేయడంతోపాటు బేకరీ యజమానిని బెదిరించారు. స్థానికులు వారికి అడ్డుచెప్పగా వారిని సైతం చితకబాదారు. ఈ దృశ్యాలు బేకరీలోని సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. బేకరీ యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. కత్తులతో వీరంగం సృష్టించిన వారిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

రెచ్చిపోతున్న పాత నేరస్తులు

రౌడీషీటర్ల గొడవలు, నేరాలు, కత్తిపోట్ల ఘటనలు నగర శివారులోని ధర్మపురి హిల్స్ ప్రాంతంలో ఎక్కువగా నమోదయ్యాయి. కొన్ని నెలలుగా గొడవలు సద్దుమణగగా.. మళ్లీ యువకులు కత్తులతో రెచ్చిపోతున్నారు. బేకరీలో కత్తులతో బెదిరింపులకు పాల్పడిన వారిలో పాత రౌడీషీటర్ సోహెల్ ఉండడం స్థానికులను భయభ్రాంతులకు గురిచేసింది. సోహెల్ పాత రౌడీషీటర్ ఆరిఫ్ మర్డర్ కేసులో జైలుకు వెళ్లి, ఇటీవలే బయటికి వచ్చి ఇలాంటి ఘటనలకు పాల్పడం చర్చనీయంశంగా మారింది.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

మాట్లాడుతున్న పోలీసులు పోలీసులు

మాక్లూర్(నందిపేట్), ఫిబ్రవరి 2: నందిపేట్ మండలంలోని వివిధ గ్రామాలకు స్కూటీపై వస్తూ గంజాయిని విక్రయిస్తున్న ఇద్దరిని పట్టుకున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. పక్కా సమాచారం మేరకు ఎస్సై తోటి సిబ్బందితో కలిసి వెల్మల్ చౌరస్తా వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా ఇద్దరు అనుమానాస్పదంగా కనిపించారు. స్కూటీపై వచ్చిన షేక్ అఫ్రోజ్, షేక్ మహమూద్‌ను తనిఖీ చేయగా రెండున్నర కిలోల గంజాయిని లభించింది. కేసు నమోదు చేసి వారిని రిమాండ్‌కు తరలించామని, సీజ్ చేసిన గంజాయి విలువ సుమారు రూ.70 వేల వరకు ఉంటుందని ఎస్సై తెలిపారు. నిందితుడు షేక్ అఫ్రోజ్ గతంలో మూడుసార్లు గంజాయి కేసుల్లో జైలుకు వెళ్లి వచ్చాడని తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

ఎడపల్లి, ఫిబ్రవరి 2: ఆర్థిక ఇబ్బందులు, ఆరోగ్య సమస్యలు తాళలేక పెట్రోల్ పోసుకొని నిప్పటించుకొని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం చోటు చేసుకున్నది. ఎడపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడ్డపల్లి గ్రామానికి చెందిన కోల దేవీ సింగ్(30)కు భార్య, కుమారుడు ఉన్నారు. వారి ఆరోగ్యం, దేవీ సింగ్ ఆరోగ్యం బాగాలేకపోవడంతోపాటు ఆర్థిక ఇబ్బందులు ఎక్కువయ్యాయి. తీవ్ర మనస్తాపానికి గురై శుక్రవారం రాత్రి పెట్రోల్ పోసుకొని నిప్పటించుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు నిజామాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి అన్న కిషన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

చెరువులో నుంచి మృతదేహం వెలికితీత

మాక్లూర్, ఫిబ్రవరి2: మండలంలోని చిక్లీ గ్రామానికి చెందిన బోదాస్ లలిత (30) శనివారం రాత్రి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై రాజశేఖర్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన దండ్ల వెంకటితో లలిత కలిసి ఉంటున్నది. శనివారం ఇద్దరి మధ్య గొడవ జరిగింది. మనస్తాపం చెందిన లలిత శనివారం రాత్రి గ్రామ శివారులోని చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. రాత్రి పూట గాలింపు చర్యలు చేపట్టలేదు. ఆదివారం ఉదయం చెరువులో గాలింపు చర్యలు చేపట్టగా మృతదేహం లభించింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. తల్లి లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చలో హైదరాబాద్ పోస్టర్ల ఆవిష్కరణ

సాలూరాలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దండోరా సంఘం నాయకులు

మోర్తాడ్/ వేల్పూర్/ నవీపేట్/ రుద్రూర్/ బోధన్ రూరల్, ఫిబ్రవరి 2: ఈనెల 7న నిర్వహించనున్న చలో హైదరాబాద్ కార్యక్రమ పోస్టర్లను ఎమ్మార్పీఎస్ నాయకులు ఆదివారం కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని మాదిగ సంఘ భవనంలో ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పాలెపు కిశోర్ మాట్లాడుతూ..లక్షడప్పులు వేయి గొంతులు అనే కార్యక్రమానికి కమ్మర్‌పల్లి మండలం నుంచి వేలాదిగా డప్పులతో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పొడేటి ధర్మయ్య, పత్రి శ్రావణ్, మైలారం రాజేందర్, కుంటికంటి నరేందర్, మైలారం బాలు, మారుతి, మహేశ్, బాలయ్య, గంగాధర్ పాల్గొన్నారు. వేల్పూర్ మండలంలోని పచ్చలనడ్కుడలో చలో హైదరాబాద్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కనక ప్రమోద్ మాదిగ, నాయకుల రాజేశ్, ప్రతాప్, రవి, మోహన్, సందీప్, సంజీవ్, మహేశ్, ప్రవీణ్, సంతోష్, మోహన్, సునీల్, ప్రమోద్, సంఘ సభ్యులు పాల్గొన్నారు. నవీపేట మండల కేంద్రంలో లక్షడప్పులు వేల గొంతులు కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి బందెల చిరంజీవి, నాయకులు ఆకారం రమేశ్, వెలుమల జీవన్, కొప్పిరిగ కిషన్, పెరిక రాములు, మోచి సంఘం మండల అధ్యక్షుడు రవి తదితరులు పాల్గొన్నారు. రుద్రూర్ మండల కేంద్రంలో లక్షల డప్పులు.. వేల గొంతులు కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పోచీరాం, మండల అధ్యక్షుడు ఊషం సాయికుమార్, ఉపాధ్యక్షుడు సాయిరాం, కార్యదర్శి నాగేశ్, కోశాధికారి పెదాస్ నాగేశ్, సంజు, రవి, సాయికుమార్, పోచయ్య, సాయిలు, శ్రీను పాల్గొన్నారు. సాలూరా మండల కేంద్రంలో పోస్టర్లను దండోరా సంఘం నాయకులు ఆవిష్కరించారు. సంఘం మండల అధ్యక్షుడు శంకర్, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు లింబూరి లక్ష్మణ్, గ్రామ అధ్యక్షుడు సుభాస్, కార్యదర్శి రవి పాల్గొన్నారు.

విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

మాట్లాడుతున్న ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి2: విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో రాణించాలని ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ సూచించారు. పట్టణంలోని మినీ స్టేడియంలో 11వ తెలంగాణ స్టేట్ ఇంటర్ డిస్ట్రిక్ సాఫ్ట్‌బాల్ ఉమెన్ ఛాంపియన్ షిప్ పోటీలను ఎస్‌హెచ్‌వో ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో రాణించాలని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని అన్నారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

గడ్డి వాము దగ్ధం

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి2: పట్టణంలోని నాల్గవ వార్డులో ప్రమాదవశాత్తు గడ్డివాము ఆదివారం దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గడ్డివాముకు ప్రమాదవశాత్తు మంటలు అంటుకోగా స్థానికులు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. వారు వచ్చి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. రూ.50 వేల నష్టం వాటిల్లిందని బాధిత రైతు తెలిపాడు.

మంటలను ఆర్పివేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పేకాడుతున్న 14 మంది అరెస్టు

వేల్పూర్, ఫిబ్రవరి 2 : పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాడుతున్న 14 మందిని అరెస్టు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ అంజయ్య ఆదివారం రాత్రి తెలిపారు. మండలంలోని పడగల్ గ్రామంలోని కోళ్లఫారంలో పేకాడుతున్నారనే పక్కా సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారని చెప్పారు. పేకాడుతున్న 14మందిని పట్టుకొని వారినుంచి 13సెల్ ఫోన్లు, రూ. 36,460 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

'బడ్జెట్లో తెలంగాణకు మొండి చెయ్యి'

భీమ్‌గల్, ఫిబ్రవరి 2: బడ్జెట్‌లో బీజేపీ సర్కారు తెలంగాణకు మొండి చేయి చూపిందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దొన్కంటి నర్సయ్య ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం పార్లమెంట్ సాక్షిగా ప్రకటించిన బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండి చేయి చూపారని, మోదీ ప్రభుత్వానికి తెలంగాణపై ఉన్న చిత్త శుద్ధి రుజువైందని మండిపడ్డారు. రాష్ట్ర ప్రజలు ఎనిమిది మంది ఎంపీలను గెలిపించి పార్లమెంట్‌కు పంపితే వారు చేసింది గుండు సున్నా అని పేర్కొన్నారు. కేంద్ర నిధులు తేవడంలో రేవంత్‌రెడ్డి సర్కారు విఫలమైందని పేర్కొన్నారు. బీజేపీ, కాంగ్రెస్‌లకు ప్రజలు బుద్ధి చెపుతారని హెచ్చరించారు.

హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన

మాక్లూర్, ఫిబ్రవరి2: మండలంలోని మానిక్‌బండార్ పరిధిలోని ఆర్టీసీ కాలనీలో ఆంజనేయస్వామి ఆలయం వద్ద భారీ హనుమాన్ విగ్రహాన్ని కాలనీ వాసులు ఆదివారం ప్రతిష్ఠించారు. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి హాజరై పూజలు చేశారు. వీడీసీ సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు. కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే అన్నారు.

సర్వసమాజ్ కమిటీకి ఫ్రీజర్ వితరణ

జొన్నల భూపాల్‌ను సన్మానిస్తున్న సర్వసమాజ్ కమిటీ సభ్యులు

భీమ్‌గల్, ఫిబ్రవరి 2: పట్టణానికి చెందిన వ్యాపారవేత్త జొన్నల భూపాల్ సర్వ సమాజ్ కమిటీకి బాడీ ఫ్రీజర్‌ను తన తమ్ముడు జొన్నల భూపేందర్ జ్ఞాపకార్థం ఆదివారం కమిటీ కార్యాలయం వద్ద అందజేశారు. కమిటీ సభ్యుడు భూపాల్‌ను సభ్యులు సన్మానించారు. కమిటీ అధ్యక్షుడు నీలం రవి మాట్లాడుతూ పట్టణంలో ఫ్రీజర్ లేదని తెలపడంతో స్పందించి అందజేయడం గొప్పవిషయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు మోహన్, కార్యదర్శి నవీన్, కోశాధికారి హరీశ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మంజీరా నుంచి ఇసుక తరలింపు

అడ్డుకున్న బరంగేడ్గి గ్రామస్తులు.. అధికారులకు ఫిర్యాదు

బరంగేడ్గి శివారు నుంచి ట్రాక్టర్‌లో తరలిస్తున్న ఇసుక

నస్రుల్లాబాద్, ఫిబ్రవరి 2: బీర్కూర్ మండలంలోని బరంగేడ్గి గ్రామ శివారులోని మంజీరా నది పరీవా హక ప్రాంతం నుంచి ఎలాంటి అనుమతి లేకుం డా ఆదివారం ట్రాక్టర్ల ద్వారా అనుమతి లేకుం డానే ఇసుకను తరలిస్తున్నారు. కాగా స్థానికులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఇసుక తరలింపుపై గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. గ్రామ శివారు నుంచి ఇసుకను మధ్యాహ్నం సమయంలో డంప్ చేసి రాత్రి పూట టిప్పర్ల ద్వారా ఇతర జిల్లాలకు తరలిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

హనుమాన్ ఆలయంలో చోరీ

ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

మోర్తాడ